నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 82
నూరేళ్ళ తెలుగు కథకు



# వాక్యానికి వార్ధక్యం రాకూడదు

- శివల జగన్నాథరావు

పోరాటం...పోరాటం...పోరాటం...జీవితమంతా పోరాటం. సమాజంతో పోరాటం. అక్షరాలతో పోరాటం. అనారోగ్యంతో పోరాటం. ఒంటరి తనంతో పోరాటం. ఆ పోరులో ఒక యోధుడు ఈ కథానికుడు. ఆయన పేరు శివల జగన్నాథరావు. శివ తాండవం ఆయన ఆడలేదు. తన కథలతో పాఠకుల్ని ఆడించారు. ఆ జగన్నాథుని జీవిత రథయాత్రలో క్షతగాత్రుడైనా తన కథాకేళిని కొనసాగిస్తున్న ఆ జీవన పోరాట మూర్తితో ఈ వారం ఇంటర్వ్యూ మీ కోసం...



చెల్లెలు పార్వతి, తమ్ముడు వాసుదేవరావుతో....

### బాల్యంలోనే బతుకు గండం తప్పింది

దేశానికి ఇంకో ఏడాదిలో స్వాతంత్ర్యం వస్తుందనగా నేను విజయనగరంలో పుట్టాను. నాన్నగారి పేరు శివల సత్యనారాయణ మూర్తి, అమ్మ సుబ్బలక్ష్మమ్మ. మేము ఏడుగురు సంతానం. నలుగురు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరు అక్కల తరువాత నేను. నాన్నగారు ఉద్యోగాన్ని డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసులో గుమస్తాగా ప్రారంభించి మేనేజర్ స్థాయికి చేరారు. ఆయన బదిలీల కారణంగా చాలా ఊళ్లు తిరగాల్సి వచ్చింది. నా బాల్యం కొన్నాళ్లు శ్రీకాకుళంలో గడిచింది. ఓ వర్షాకాలం స్కూల్ నుంచి వస్తూ నీటి మడుగులో మునిగిపోయి ప్రాణ గండం తప్పి బతికాను. యవ్వనం మొగ్గ తొడిగి, పుష్పించి, పరిమళించితే కొందరికి పెద్దచదువు అవుతుంది. మంచి ఉద్యోగంతో పాటూ, జీవిత సహచరి లభిస్తుంది. నా యవ్వనం పరిమళించి ఒంటరితనంతో పుష్పించి సాహిత్యంగా మారింది.

### తొలి గురువు కళ్లేపల్లి శ్రీధరం గారు

మేము కాకినాడలో ఉన్నప్పుడు కళ్లేపల్లి శ్రీధరం గారని మా వీధిలో ఉండే వారు. నాకు బొమ్మలు గీయడం, కథలు రాయడం నేర్పిన గురువు ఆయనే! కాకినాడలో వి.ఆర్.కాలేజీ హైస్కూల్లో సెకండ్ ఫారమ్ వరకు చదివిన రోజులు ఎంతో హాయిగా ఉండేవి. ఓమ్ లైబ్రరీకి వెళ్లి నేను, తమ్ముడు వాసుదేవరావు ఎన్నెన్నో పుస్తకాలు చదివాము. అప్పుడే నాలో సాహిత్యం పట్ల కుతూహలం, ఇష్టం, ఆత్రం కలిగాయి. రచయితలు. బుర్రకు బొమ్మ కట్టినట్లు ఎలా రాస్తారు చెప్మా? అని ఆశ్చర్యపోయాను. ఆ తరువాత మా గురువుగారి. ఆశీర్వచనం రచనలకు ప్రేరణ అయింది.

### తొలి, మలి కథలు ఆ పత్రికలోనే...

నా మొదటి కథ పేరు 'సీత'. విశాఖపట్నంలో ఉన్నప్పుడే రాశాను. ఇద్దరు స్నేహితురాళ్ల అనుబంధాలు, ప్రేమలు, భర్తలపట్ల అనురక్తి ఆ కథ సారాంశం. అది 1965-66లో అనుకుంటా ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురింపబడింది. రెండో కథ 'పాఠం నేర్పిన పాఠం' 'సీత' కథ అచ్చయిన నెలలోనే అదే వారపత్రికలో అచ్చయింది. ఆనాటి నుండి ఈనాటి వరకు నా కలానికి విశ్రాంతి నివ్వలేదు.

### అనారోగ్యాన్ని ఒంటరితనాన్ని ఇప్పటికీ ఎదుర్కొంటున్నాను

ఊళ్లన్నీ తిరుగుతూ మళ్లీ విశాఖపట్నంలో పడ్డాం. ఎం.జి.ఎం. హైస్కూల్లో థర్డ్ ఫారమ్ నుంచి ఎస్సెస్సెల్సీ దాకా చదివాను. మందులకు లొంగేదైనా జీవితాంతం వేధించే వ్యాధితో రెండుసార్లు కె.జి.హెచ్‌లో ఇన్‌పేషంట్‌ను అయ్యాను. చదువు ఆగిపోవడానికి, ఉద్యోగం చేయడానికి అనారోగ్యం అడ్డు వచ్చినా, ఊళ్లు ఏలడానికీ, నా రాతలకీ అడ్డుకాలేదు. సాహిత్యం పట్ల ఆసక్తి తోబుట్టువుల ప్రోత్సాహంతో రచనలు ఆపలేదు.

### విశాఖ రచయితలతో పరిచయం

మా పిన్నిగారి భర్త భద్రమూర్తిగారు నన్ను విశాఖ రచయితలకు పరిచయం చేశారు. బలివాడ కాంతారావు, కాళీపట్నం రామారావు, అంకర వెంకట కృష్ణారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆదూరి వెంకట సీతారామమూర్తి...ఇంకా ఎందరో రచయితలు నన్ను ప్రోత్సహించారు. 'నువ్వు యుద్ధం చేయగలవు' అనే శ్రీకృష్ణుడు ఉంటే, ఏ కళాకారుడైనా అర్జునుడై ముందుకు ఉరుకుతాడు. ఒకసారి చాగంటి సోమయాజులు గారు నన్ను ఆశీర్వదించి 'నీకు కథ రాయడం వచ్చింది' అన్నారు. ఆ ప్రోత్సాహంతోనే అప్పట్లో 'డేర్ డెవిల్' అన్న నవల రాశాను. విశాఖ నుంచి వెలువడుతున్న ఒక ప్రముఖ దినపత్రికలో అప్పుడు అధి సీరియల్‌గా వచ్చి పాఠకుల్ని మెప్పించింది. అనంతరం 'డిగ్రీ కోడళ్లు' అన్న పెద్ద కథ ఒకటి రాశాను. అది ఆ రోజుల్లో ఓ సంచలనం.

### అది పద్ధతి కాదు

'నాకు ఒంట్లో బాగున్నప్పుడే కథలు రాస్తాను. సభలకు వెళతాను' అనడం వేరు. 'నాకు ఒంట్లో బాగున్నప్పుడే నేను ఉద్యోగానికి వస్తాను' అంటే ఏ యజమాని ఊరుకోరు కదా! ఏ సంస్థా ఒప్పుకోదు కూడా. అది పద్ధతి కూడా కాదు. అలా నేను ఉద్యోగాన్ని కోల్పోయి నిరుద్యోగిగా మిగిలి పోయాను.

### కన్నడంలోకి అనువాదం.

మా పెద్దక్క విశాఖలోనే కాపులుప్పాడలో టీచర్‌గా చేస్తున్నప్పుడు నేను వెళ్లి రెండు నెలలు అక్కడ ఉన్నాను. అక్కడి అనుభవాలను, పరిస్థితులను అక్షరీకరించి 'భాను' అన్న నవల రాసి 'జ్యోతి' మాస పత్రిక నవలల పోటీకి పంపాను. రెండో బహుమతి వచ్చింది. వైజాగ్ డాక్ లేబర్ బోర్డు వాళ్లు 'భాను' నవలను స్టేజి నాటకంగా రూపొందించి ప్రదర్శించారు. కొద్దికాలంలోనే ఆ నవల కన్నడం లోకి కూడా అనువాదం అయింది.

### అమ్మా నాన్నల నిష్క్రమణతో విషాదం

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నాన్నగారు పోయారు. అమ్మ పోయింది. విషాదం అలుముకుంది. ఒంటరితనం మరింత దగ్గరయింది.



మేనకోడళ్లు, మేనల్లునితో...

ముఖ్యంగా అమ్మ కాలం చేశాక విశాఖపట్నంలో ఉండాలనిపించలేదు. హైదరాబాద్‌లో ఉన్న తమ్ముడి ఇంటికి వెళ్లిపోయాను. కానీ అక్కడా ఎక్కువ రోజులు ఉండలేకపోయాను. అనకాపల్లిలో ఉన్న అక్క ఇంటికి వెళ్లాను. యవ్వనానికి పెళ్లి కాలేదని ఆగిపోదు. అది వృద్ధాప్యం అయి తీరుతుంది. జీవితాన్ని అలా కూడా స్వీకరించాను. జీవితం యవ్వనం అయితే అది కథ. వృద్ధాప్యం అయితే అది సీరియల్ నవల. అనకాపల్లిలో ఇచ్ఛాపురం రామచంద్రంగారు మంచి స్నేహితులు అయ్యారు. తరచూ మా ఇంటికి వచ్చేవారు. ఆయన నేతృత్వంలో అనకాపల్లి సాహితీ సమితి వారు నాకు సన్మానం చేశారు. అప్పటికి విషాదం వదిలి కొంత ఉత్సాహం వచ్చింది.

## నాకు నచ్చినవి

| | | |
|---|---|---|
| రచనలు | : | అక్షరాలతో పాఠకులకు అలరించిన 'రావిశాస్త్రి' గారి రచనలన్నీ. |
| సినిమా | : | ఒక కళాకారుడి భరించలేని తనం, మరో కళాకారుడి భవిష్యత్తుని నామరూపాలు లేకుండా చేయడం ఇతివృత్తంగా వచ్చిన 'స్వాతి కిరణం' |
| సినీ గీతం | : | జ్వలించే జీవితాల హృదయాలను చెప్పిన 'ఇదే లే తరతరాల చరితం' (పెద్దరికం) |
| గాయకుడు | : | ఇంకొన్ని సంవత్సరాలు బ్రతికిపాడితే ఎంత బాగుండేది –అనిపించిన 'ఘంటసాల' |
| హీరో | : | 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని రుజువు చేసిన అక్కినేని నాగేశ్వరరావు. |
| హీరోయిన్ | : | పాత్రకు పెంకితనాన్ని నేర్పి ప్రేక్షకుల్ని అల్లరిపెట్టిన 'భానుమతి' |
| చిత్రకారుడు | : | బొమ్మకు బోలెడు సొగసులద్దిన 'బాపు' |
| నాటకం | : | అజరామరమైన గురజాడ సృష్టి 'కన్యాశుల్కం' |
| వంటకం | : | జిలేబి |
| స్నేహితుడు | : | ప్రతి రోజూ కలిసే గణపతిరాజు అచ్యుతరామరాజు |



సన్మాన సందర్భంలో...

## ముమ్మరంగా రాసింది వయసులో ఉన్నప్పుడే

నా ఇరవై ఆరవ ఏట నుంచి నలభయ్యో సంవత్సరం వరకు నా కథలు అన్ని వార మాస పత్రికల్లోనూ వెలువడ్డాయి. కాకిపిల్ల రక్షణ కోసం తల్లి కాకిపడే ఆరాటాన్ని, తాపత్రయాన్నీ కథగా రాశాను. మేకల్ని, కోళ్లని తినడం నా అనారోగ్యం కంటే ఎక్కువ బాధించేది. ఆ మూగజీవాల మీద 'కొక్కొరొకో' అన్న కథ రాశాను. పెళ్లిళ్లకి శుభకార్యాలకీ ఎక్కడకు వెళ్లినా, అక్కడి సంఘటనలన్నీ కథలుగా మలిచేవాడ్ని. రిక్షా వాని జీవితం, సనాతన సంప్రదాయ కుటుంబాల్లో జరిగే లోగుట్టు సంగతులు అన్నీ కథా వస్తువులుగా చేశాను. 130 కథలు, 10 నవలలు, ఎన్నో రేడియో నాటికలు రాశాను. హాస్పిటల్లో పేషెంట్ చావుబతుకుల్లో ఉంటే చుట్టాలు, పెళ్లికొచ్చినట్లు ప్రవర్తించడాన్ని చూసి 'వీళ్లేం చుట్టాలు?' అని ఓ కథ, జనంతో కిక్కిరిసిన బస్సులో వెళుతున్న అనుభవంతో 'నడుస్తున్న నరకం...' ఇలా ప్రతి సంఘటననీ అక్షరాల్లో ఆవిష్కరించాను.

## కాలు కోల్పోయేముందు సన్మానం

విశాఖపట్నంలో గణపతిరాజు అచ్యుతరామరాజు గారు మరోసారి సన్మానం చేసినప్పుడు అనకాపల్లిలో ఉన్నప్పటి హుషారు లేదు. ఎందుకంటే ఆ సమయానికి నా ఎడమ కాలు ఆపరేషన్‌కి సిద్ధంగా ఉంది. ఇద్దరు మనుషులు పట్టుకుని నడిపిస్తే, వేదిక ఎక్కడానికి చాలా ఇబ్బంది పడ్డాను. నా జీవితంలో యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకట కృష్ణమూర్తి వంటి ప్రముఖ రచయితలతో కూడా పరిచయమున్నా, నాకు అతి దగ్గరగా వచ్చిన స్నేహితులలో కొందరు కాయితి అప్పారావు (అప్పాజీ), లాయర్ ఎం.రామకోటి. కొ.స.నా.

## ఒక దశలో అసూయతో రాశాను

నిత్యజీవిత పోరాటం సాగిస్తున్న నా మానసిక స్థితి నా జీవన మార్గం. ఒక దశలో అసూయతో కూడా కథలు రాశాను. 'అంత మంది రాసేస్తున్నారు. నేనెందుకు రాయకూడదు?' అన్న తపన అనారోగ్యంలో కూడా నా రచనలకు ఊపునిచ్చింది. కళాకారుడికి వాడి కళను వాడు కొనసాగించడానికి తాపత్రయముండాలి. మరో కళాకారుడి ఉన్నత స్థితిని భరించలేని గుణం మాత్రం ఉండకూడదు.

## బహుమతులు వచ్చాయి

కథల పోటీకి ఎలాగైనా బహుమతి పొందాలని కష్టపడి రాస్తే సాధారణ ప్రచురణ జరిగేది. నా దృష్టిలో అసాధారణం సంపాదకులకు సాధారణం అయ్యేది. అయినా ఆంధ్రపత్రిక, జ్యోతి, స్వాతి, ఆంధ్రప్రభ తదితర ప్రముఖ వార మాస పత్రికల్లో కొన్ని బహుమతులు వచ్చాయి.

## కథల సంపుటి రాలేదు

కథల సంపుటి తేవాలి అంటే డబ్బు కావాలి. ఉద్యోగం జీతం ఉండి ఉంటే, ఒకటి రెండు సంపుటాలు తీసుకొచ్చే వాడ్ని. ఎవరో ఒకరు లేదా కొంతమంది ఒక్క స్నేహభావంతో, బంధుప్రీతితో, ఉపకార చింతనతో మాత్రమే ఈ పని చేయలేరు కదా! ఏ ప్రచురణకర్తగానీ, సాహితీ పోషకులు గానీ ముందుకు వస్తే నేను పదిలపరచుకున్న నా కథలన్నీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. ఈనాటి వర్ధమాన రచయితలకు ఆనాటి కథాంశాలు చాలా ఉపయోగ పడతాయని నా అభిప్రాయం.

## నూరేళ్ల కథా పరిణామం

నూరేళ్లలో రాజకీయాల్లో మార్పులొస్తాయి. పరిస్థితులు మారుతాయి. విజ్ఞానం పెరుగుతుంది. వృద్ధాశ్రమాల గురించి రాయాల్సిన దుస్థితి వస్తుంది. ఆలోచనల్ని అక్షరీకరించడానికి నూరు కాదు కదా వెయ్యేళ్లయినా రచయిత మెదడు ఒక్కలాగే ఉంటుంది. చుట్టూ ఏ వాతావరణం ఉంటే దాన్ని 'అగస్త్య మహాముని సముద్రాన్ని అవుపాసన పట్టినట్లు, రచయిత అనేవాడు పడతాడు. కాలం మారినా, వయస్సు మీరినా, రచనా విధానం, ఒరవడి, ఎవరి పద్ధతి వాళ్లదే! గురజాడ అప్పారావు గారు ఇప్పుడు బతికి ఉంటే ఆయన రచనల్లో ఒక గిరీశం, మరో రామప్ప పంతులు, ఇంకో లుబ్ధావధానులు వేషభాషలు మారినా ఖచ్చితంగా ఉండి తీరతారని అనుకుంటాను.

## నేటి కథా సాహిత్యం గురించి....

నేటి కథా సాహిత్యం మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉంది. కుటుంబ నేపథ్య కథలతో పాటు, దినపత్రికల్లో చదివిన సమస్యల మీదా కథకులు చక్కగా స్పందిస్తున్నారు. రచయిత బాధ 'బాణం' అవుతోంది. అది అన్యాయం పట్ల 'అస్త్రం' అవుతోంది. ఒక పక్క సరసం 'సమ్మోహనాస్త్రమూ' అవుతోంది. అన్యాయాన్ని సహించలేని కథకుడు అక్షరాన్ని 'ఆయుధం'గా వాడుతున్నాడు. వందేళ్లలో పరిస్థితులు మారాయి. కనుక పరిస్థితులకు అనుగుణంగా రచయిత రాయక తప్పదు. 'పడవ ఎక్కబోతూ....' 'బస్సు ఎక్కబోతూ...' 'రైలు ఎక్కబోతూ' 'విమానం ఎక్కబోతూ..' అని కథలు రాసిన రచయితలు ఇప్పుడు 'చంద్రుని మీదకు వెళ్లబోతూ...' అని రాయడానికి సిద్ధంగా ఉన్నారు. వారికి నా అభినందనలు.

–మేడా మస్తాన్‌రెడ్డి
**94413 44365**

నాకు నచ్చిన నా కథ

# నిర్ణయం

- శివల జగన్నాథరావు

ఈదురుగాలి ఆ చెవిలోంచీ ఈ చెవిలోకి కొడుతోంది. చెట్ల ఆకులు గాలికి వజవజ వణుకుతున్నాయి. ఆకాశం చిన్న మబ్బుపట్టి వున్నది. చంద్రుడికి చలివేసే మబ్బు దుప్పటి కప్పుకు నిద్దరపోతున్నాడులా వుంది. ఎక్కడా దర్శనం లేదు.

ఊరికి ఒకవేపున, దట్టంగా పరిచిన దరిద్రంలా పూరిపాకలు కుప్పలుగా వున్నాయి. కుళ్ళు కాలువలు, చెత్తా చెదారంతో పాకల పతనావస్థ మరింత బహిర్గతం అవుతోంది. ఈదురుగాలి అటు వూళ్లో మేడల్లోని ఆసాముల్నీ, ఇటు పాకల్లోని జనాన్ని ఒక్కలాగే జోకొడ్తోంది.

చీకటి పచ్చిగా వ్యాపించిన పాకల మధ్య నించి, మట్టి నేలమీద మెత్తటి నిశ్శబ్దపు అడుగులతో ఒకవ్యక్తి నడుస్తున్నాడు. నాలుగు పక్కల్నీ జాగ్రత్తగా పరికిస్తున్నాడు. దూరంగా కుక్క అరుపు వినిపిస్తే వులిక్కిపడుతూ, ఆగి ఆగి వెళ్తూన్నతను ఒక పాక దగ్గరాగిపోయాడు. ఆ పాకకి వున్న ఒక్క కిటికీ రెండు తలుపుల్లో ఒకటివేసి వుంది లోపలికి. ఒకటి కొంచెం వారగా వుంది. ఆ కంతలోంచి లోపలికి చూశాడు.

లోపల చిన్న చిమ్నీదీపం ఓ మూల కూచుని, దాని గుడ్డి వెలుతురుని ఆ గది అంతటికీ దాని శాయశక్తులా పంచుతోంది. గది మధ్యన ఒక నులక మంచం మీద, బొంతల్లో రెండేళ్ళ పిల్లవాడు నిద్రపోతున్నాడు. మంచం దిగువున తాటాకు చాపమీద, బొంతపర్చుకుని, దుప్పట్లో రెండు శాల్తీలు ఒకటయి వున్నాయి. ఆ గదిలో వాళ్ళు ముగ్గురే కనిపిస్తున్నారు.

పాక యివతల నిలబడి, కిటికీ రెక్క సందులోంచి లోపలికి చూస్తున్న వ్యక్తి. తలుపు దగ్గరికివెళ్ళి, తలుపు తెరిచే ప్రయత్నం చేశాడు. లోపలి నించి పెట్టిన గడియ వూడింది నింపాదిగా తలుపు తోసి, అడుగులో అడుగేస్తూ లోపలికి వెళ్ళాడు. క్షణం వూపిరి బిగపట్టాడు.

చాపమీద ఆమె కదిలింది. చేతులు చాపి, ఒళ్ళు విరుచుకున్నప్పుడు నగ్న స్తనద్వయం బరువుగా కదిలింది. ఆమె కళ్ళు తెరవకుండానే మళ్ళా దుప్పట్లో అతడిని కరుచుకుపోయింది.

ఎక్కడో ఓ కుక్క అరుపు. అవతల కీచురాళ్ళ మోత ఈదురు గాలి రొదరొద. ఆ వ్యక్తి మంచం మీదకి ఒంగాడు ఒడుపుగా పిల్లవాణ్ణి తీసుకున్నాడు. అడుగులో అడుగేస్తూ అవతలికి వెళ్ళి చీకట్లో కలిసిపోయాడు.

కీచురాళ్ళు మోత పెడుతూనే వున్నాయి.

ఈదురు గాలి రోదిస్తూనే వుంది.

ఆకాశం మరింత మబ్బుని కప్పుకుంది.

***

తెల్లవారింది.

మబ్బు విడివడి, ఎండ వచ్చి, వూరంతటిని పలకరించింది. పాకల దగ్గరికి వెళ్ళింది. పరామర్శ చేసింది. సానుభూతిగా చూసింది.

గోలగోలగా వుందక్కడ. ప్రతీపాక దగ్గరా ఇద్దరు ముగ్గురు చేరి. ఆ కబురు చెప్పుకుని ఆశ్చర్యపోతున్నారు. ''ఎంత పనయిందీ?! ఎంత ఘోరం!?'' అంటున్నారు.

''ఇయాల ఆళ్ళకయింది! రేపు మనకవదని ఏవిటి?''

''ఓలమ్మా! ఎత్తుకెల్లడానికి... మాయదారి సచ్చినోల్లకి పసిబిడ్డే దొరికేడా?''

ఒకామె ''ఆ చలపతికి మంచి శాస్తి జరిగిందిలే!'' అనేసింది కసిగా.

''సీ! అలాగనకొదినే!'' అంది రెండో ఆమె.

''కాకపోతే ఏటమ్మా? ఆడీ మధ్యన కన్నూ మిన్నూ కానకుండా వుంటన్నాడా మరేవన్నానా? ఆడు తాగితే ఆడి పెళ్ళాన్ని తిట్టుకోమను! ఏం చేస్కోమను! మనకెందుకు? మనందర్నీ ఎందుకు తిట్టాలా? ఆడికేటవుసరం? ఏం నోరు కొవ్విందా సచ్చినోడికీ? ఈ దెబ్బతో ఆడి పొగరు తగ్గుద్దిలే!''

చలపతి తన దుష్టత్వాన్ని వాడవాడంతా కళ్ళాపి చల్లుతున్నాడని. వాణ్ణి కాస్సేపు ఆడవాళ్ళు ఆడిపోసుకున్నారు. మగవాళ్ళుపైకి ఏమీ అనక పోయినా, పళ్ళు కొరుక్కు

## కథాంతరంగం



నాకు నచ్చిన నా కథ 'నిర్ణయం'లో ఆ కుర్ర వాడ్ని వాడి నాన్నకి (చెడ్డకి) అప్పగించమంటారా? వాడి తాతకి (మంచికి) అప్పగించమంటారా? అని తాత జనాన్ని ప్రశ్నిస్తాడు. ఆ పాటికే నవనాడులూ క్రుంగిపోయిన చలపతి నిర్ణయం ఆ జనం నిర్ణయం కోసం ఎదురు చూస్తుంటుంది. ఒక చెడ్డ ప్రభావంతో ఇంకో చెడ్డ ఉద్భవించకూడదు. అలా తయారయితే జనాభా మొత్తం ప్రమాదకరం అవుతుందని చెప్పాను.

–శివల జగన్నాథరావు
సెల్: 93946 90350

న్నారు. ఓ ముసలమ్మ కలిగించుకుని, 'స్సె! వూరుకోండే! బిడ్డపోయి ఆళ్ళేడుస్తా వుంటే యిప్పుడీ మాటలేటి?'' అని మందలించింది గట్టిగా.

చలపతి ఇంటికివెళ్ళి, సానుభూతి సంతాపం వ్యక్తం చేసి వస్తున్నారు వాడలోని జనం. వాడిని చూసి కాదు, వాడి పెళ్ళాం సాయిత్రిని చూసి.

సాయిత్రి ఏడ్చీఏడ్చీ ముద్దయిపోయింది. రాత్రి తమ దగ్గర పడుకున్న పిల్లవాడు తెల్లవారి చూచేసరికి కన్పించలేదు అంటే ఎంత దుఃఖంగా వుంటుంది?! పాకలో ఏ వస్తువా ముట్టుకోక పిల్లవాణ్ణి ఎత్తుకెళ్ళాడంటే వాడు ఖచ్చితంగా పిల్లల దొంగే అయివుంటాడు! ఎక్కడికి ఎత్తుకు పోయేరే; ఎక్కడ ఎవళ్ళకి అమ్మేస్తున్నాడో? వాడినే ఘాతుకానికి బలి చేస్తున్నారో? వాడి భవిష్యత్తెలా వున్నాదో??

''ఓలమ్మో! ఓర్నాయినో! నా కొడుకో నా కొడకో! ఏడున్నావురా కొడకా! ఏమయిపోయేవురా కొడకా!''

సాయిత్రి దుఃఖానికంతం లేదు. అది ఆకాశం అంతయింది. మబ్బుతో కూడి వురుముల్నీ, పిడుగుల్నీ కురిపిస్తోంది. హోరున వర్షిస్తోంది. ఎండతో చేరి అగ్గిపిడుగుల్ని రాలుస్తోంది. భగభగమండుతోంది. అంతలో చలిచలిగా మారి వజవజా వణకుతోంది. అది సముద్రం అవుతోంది. సాగరఘోష పెడుతోంది. భూఁవితల్లి అయింది. కొండంత శోకాన్ని కడుపులో అణుచుకుంటోంది. నేలన పడీ, నోట్లో చీరచెంగు కుక్కుకునీ, నిస్త్రాణగా వుండిపోయింది సాయిత్రి.

దాన్ని చూడలేకపోతున్నాడు చలపతి. దాన్నెలా ఓదార్చాలో వాడికి తెలియడం లేదు. తను తాగినప్పుడు దాన్ని తిట్టడం తెలుసు. తన్నడం తెలుసు. మనసుపుడితే దగ్గరవడం తెలుసు. కాని... బిడ్డపోతే. ఆ తల్లినెలా సముదాయించాలో తెలియకుండా వుంది? ఏం చెయ్యడం?

ఆరోజు మహాయాతనగా గడిచింది! మర్నాడు వేదనగా గడిచింది. మూడో నాడు దిగులు దిగులుగా. వులికులికిపాటుగా గడిచింది.

వాళ్ళతో పాటు ఆ వాడంతా వులికిపడుతోంది ఏమో ఏ రాత్రివేళ. ఎవడొచ్చి ఎవరి పిల్లణ్ణి ఎత్తుకు పోతాడో?

ఆవాళ ఎవరో ఒక కబురు తీసుకు వచ్చారు?

ఊర్లో ఎవరో కుర్రవాడు చెరువులో శవంగా తేలాడు! వార్త అందరినీ నిశ్చేష్టుల్ని చేసింది. భయభ్రాంతుల్ని చేసింది. గజగజా వొణికిపోయారు. అక్కడ పరిగెత్తారు. వాళ్ళతో చలపతి వెళుతూంటే సాయిత్రి తనూ వస్తానంది ''ఒద్దే? నువ్వు చూళ్ళేవే'' అన్నాడు చలపతి.

''నా కొడుకుని నేన్చూస్కోవొద్దా?'' ఏడ్చింది.

''అదిగాదే! ఆణ్ణలా సూసి నివ్వేటయిపోతావోననే''.

సాయిత్రి కూలబడిపోయింది. ''తను పిల్లాణ్ణి ఆ పరిస్థితిలో ఎట్లా చూడగలదు. వుఁహూ!'' గొల్లుమంటూ వుండిపోయింది. చలపతి వెళ్ళాడు. ఆత్రంగా వెళ్ళాడు. బెరుగ్గా బెంగగా వెళ్ళాడు. భయంతో భీతితో వెళ్ళాడు. శోకంతో,



వుద్వేగంతో వెళ్ళాడు. వెళుతూంటే చలపతి ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి. వొళ్ళు వొణికింది. గొంతెండి పోయింది. చెరువులో ఎలా పడ్డాడు? ఎవరు తోసేసేరు? ఎత్తుకెళ్ళినవోడు ఎందుకట్టా చేసేడు? చంపేస్తే ఆడికొచ్చినదేటి? అసలాణ్ణి ఏ వుద్దేశంతో తీసుకు పోయాడాడు? అన్నీ ప్రశ్నలే. అన్నీ సందేహాలే! వాటితో చలపతి వుక్కిరిబిక్కిరవుతున్నాడు. చెరువులో కుర్రాడు! శవం అయితేలాడు?

చలపతి చెవుల్లో బాంబులయి పెద్ద పెట్టున బ్రద్దలవుతోంది ఆ వార్త! అతడిని నిలువునా చెమటతో తడిపి ముద్దముద్ద చేసేసింది. ఎప్పుడూ చలపతి ఇంత వుక్కిరిబిక్కిరవలేదిప్పటి దాకా. తనింట్లో, తనవాళ్ళిద్దరూ కులాసాగా వుండడమే వాడికి తెలుసు. కొడుకు ఆడుకోవడమూ, అల్లరి చేయడమూ తెలుసు. భార్య వొండిపెట్టడం, సంసారం చెయ్యడమూ తెలుసు. వాళ్ళున్నారన్న దిలాసాతో తను తప్ప తాగడవూ తెలుసు. తయ్యిమని గెంతడమూ నోరెత్తితే సాయిత్రిని రెండు తన్నడవు తెలుసు. అంతేగాని తన వాళ్ళు కనిపించలేదనే లోటుని, ఆ ఎడబాటుని, ఆ దిగులునీ ఎలా ఎదుర్కోవాలో, ఎలా భరించాలో తనకిప్పటిదాకా తెలీదు! అందుకే చలపతి వుక్కిరి బిక్కిరయి పోతున్నాడు.

వెళ్తూ వెళ్తూ చలపతి సహజ గుణంతో, ''రేయ్! నా కొడుకెట్టా పడిపోయేడ్రా, చెరువులో? అంత పసివోడు? ఆడికి రెక్కలు మొలిచినాయా? ఎవురాణ్ణి చంపే సేరు? చెప్పండి? తోలు ఒలిసేస్తాన్నా కొడకల్లారా? మీకు నా మీద దొబ్బు తెగులుంటే నన్ను సంపండి! అంతేగానీ. నా పిల్లణ్ణి సంపుతార్రా?''.... అంటూ రంకెలు వేశాడు.

ఇరుగూ పొరుగూ ముఖాలు చూసుకున్నారు.

''ఛీ! నీ నోరుపడా! ఎంతకూత వొస్తే అంతా కూస్తావు? మా వెందుకురా, నీ పిల్లణ్ణి సంపుతాం? నీలాగే మాఁవూ దుర్మార్గులం కావు! పాపం మాటలాడమాకు!'' అని తిట్టారు.

దోవంతా పోట్లాడుకున్నారు చలపతి. వాళ్ళూ, చలపతిలో వుద్రేకం. వుద్వేగం తారాస్థాయినందుకుంది. వాళ్ళని తిడ్తూ, వొణుకుతూ, నిలువునా చలిస్తూ వెళ్ళి చెరువు దగ్గర చూస్తే, అక్కడ చెరువు ఒడ్డుకి అప్పటి కప్పుడే ఆ కుర్రవాడి కళేబరాన్ని తెచ్చిపడేశారు. ఒళ్ళంతా నీటికి నాని నానీ, వుబ్బిపోయి వున్నది. దగ్గరగా పోయి చూశాడు చలపతి. ఆ కుర్రవాడికి సుమారుగా నాలుగయిదేళ్ళుంటాయి! వయసు తన కొడుకుది కాదు! పోలికలు తన కొడుకువి కావు!? అమ్మయ్య! ఒక్కసారి చలపతికి వెర్రి సంతోషంతో వళ్ళు జలదరించింది. ఆనందంతో కళ్ళు చెమర్చాయి. వాడలో వాళ్ల అతడిని ఇంకోసారి తిట్టారు. తమని వాడు ఇందాక అనుమానించాడన్న కోపంతో. చలపతి ఈసారి వాళ్ళ తిట్లని పట్టించుకోలేదు. తన కొడుకు చచ్చిపోలేదన్న సంతృప్తితో ఎక్కడో బతికి ఉన్నాడన్న ఆనందంతో ఆ కబుర్ని సాయిత్రికి చెపితే సంతోషంతో ఏడ్చింది సాయిత్రి. ''మరయితే ఏటయ్యేడు?'' అడిగింది ఆ ప్రశ్నకి జవాబేదీ?

ఏమయ్యాడు? ఏమయ్యాడు?

మరో రోజున, మరో జవాబు దొరికింది!!

''రేయ్! చలపతీ నానియ్యాళ చూసేన్రా! మన రిక్చావోళ్ళ జంక్షనున్నది సూడు? ఏది. రామా టాకీసు కాడ? అక్కడో చిన్న కుర్రోణ్ణి. రోడ్డు పక్క గుడ్డ మీద కూచో పెట్టి ఎవుడో అడుక్కుంటన్నాడ్రా? ఆ కుర్రోడికి కళ్ళు లేవురా? పాపం? మూతలు పడిపోయి వున్నాయిరా? బలవంతంగా గుడ్డోణ్ణి చేసేసినట్టున్నందిరా? ఆణ్ణి జనానికి సూపించీ కళ్ళు లేనోడనీ, కనికరం సూపించమనీ అరుస్తూంటే డబ్బు లేస్తన్నార్రా!! ఆ కుర్రోడచ్చం మీ యబ్బాయిలాగే వున్నట్టుంది! నా కలాగే అనుమానంగున్నాదరా''.

అని ఆ మనిషి చెప్పడం ఏమిటి? చలపతి ఆ కబురు సాయిత్రికి చేర వెయ్యకుండానే పరిగెత్తాడక్కడికి. ఏమో! సాయిత్రి కదంతా చెబితే అది యింటా గుండె ఆగి. సచ్చి వూరుకుంటదేమో?!

చలపతి వడివడిగా వెళుతున్నాడే గాని, అతడి కాళ్ళు తడబడి పోతున్నయ్. నీర్సంతో భయంతో కాళ్ళు చచ్చుబడిపోయినట్టయింద తడికి. 'ఎంత ఘోరం! అంత పసివాణ్ణి బలవంతంగా గుడ్డోణ్ణి చేసే సేరా!? ఆణ్ణి సూపించీ అడుక్కు



తింటన్నార్రా? ఎంత అన్యాయం? దేవదేవా? ఆడు నా కొడుకు అయితే నానింక బతకలేను! ఆణ్ణలా సూళ్ళేను. నా వల్లకాదు! దడదడ లాడుతోన్న గుండెతో, దబదబా వణుకు తోన్న కాళ్ళతో ఆ చోటికి చేరుకున్నాడు చలపతి వెంట తీసుకు వచ్చిన వాడు. ''అదిగోరా! ఆడే! ఆడే!'' అని చెప్పాడు.

చలపతి దగ్గరకి వెళ్ళి చూశాడు. ఆ కుర్రవాడు తన కొడుకులాగే వున్నాడు. అదే రంగు! అంత వయసు! అంతే ఎత్తు.

ముఖం పరకాయించీ చూశాడు చలపతి

కాదు కాదు! వాడు కాదు! తన కొడుకు కాదు ఆ కుర్రోడు!! ఎంత మాత్రవూ తన కొడుకు కాదు. అమ్మయ్యా! తన కొడుక్కాదు! దేవదేవా తన కొడుక్కాదు! పరమేశ్వరా తన పిల్లాడు మాత్రం కాడు!...

చలపతి గుండె కుదుటపడింది. ఒళ్లు ఒణకడం తగ్గింది. కాళ్ళు తడబడ్డం లేదిప్పుడు. ఎన్ని వందలసార్లు అమ్మయ్యా అనుకున్నాడో లెక్కలేదు!!

చలపతి నిర్భయంగా, కుదురుగా యింటికెళ్ళాడు. అంత నిబ్బరంలోనూ, ఓ మూల అయితే కొడుకేమయ్యేడు? అన్న సందేహం కుమ్మరి పురుగులా తొలుస్తూనే వుంది.

ఒక వయిపు ఏదో తృప్తి మరో వయిపు ఏదో అనుమానం – అపశృతి పలుకుతూనే వుంది మనసు.

ఇది జరిగిన మరునాడే. వాడలో మరో దుమారం రేగింది. నలుగురు ఓ నడి వయసు మనిషిని పట్టుకుని తీసుకువచ్చారు చలపతి దగ్గరకి. అనుమానం మీద అతణ్ణి పట్టుకున్నారు వాళ్ళు.

''ఎవడీడు?'' అడిగాడు చలపతి.

''పిల్లల దొంగ? మా కళ్ళారా చూశాం! నాను నా రిక్షా ఎక్కి నాయన్ని ఆయనింటికాడ దింపుతావుంటే. ఆ వీధిలో, ఈడేమో ఒకింటిముందు తచ్చాడతన్నాడు! నాకు అనుమానం వొచ్చీ, ఆ జంక్షనులో వున్నోళ్ళు మనోళ్ళని పిలుచుకు వొచ్చేను! ఆ సరికీడు ఓ నాలుగేళ్ళబ్బాయిని దగ్గరికి పిల్చి ఏదో చెప్తావున్నాడు. ఆ పక్కకి లాక్కెళ్ళీ! మేం అయింతా సుట్టుముట్టీ, పట్టుకు లాక్కువచ్చేం!! ఎంత డిగినా చెప్పడం లేదు.''

''మీ మాటలు నేన్నమ్మనా!'' అన్నాడు చలపతి.

వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

''అవున్రా! ఇంతకుముందే ఇట్టాగే ఏవో చెప్పేరు! మీ మాటలు నమ్ముకునీ సూస్తే. ఏటీకాదు! మీరు చెప్పిందోటీ! జరిగిందోటీ!''

''దానికీ. దీనికి సాపత్తెం యేటి? ఆడు నీ పిల్లడు కాకపోతే మావేం సేస్తాం. ఈడు మాత్రం పిల్లల దొంగే!''

''ఏటి రుజువు?''

ఒళ్ళు మండిపోయింది వాళ్ళకి చలపతి మీద.

''ఒరే మీరంతా నన్ను ఎదవని సేస్తన్నార్రా!! నా అనువు చూసీ, నన్ను ఆడిస్తున్నారు?'' తిట్టాడు చలపతి.

వాళ్ళు రెచ్చిపోయారు.

''ఛీ! ఛీ! నిన్నసలు రావరావా అంటే పాపం! నీకు సాయం చేయడం మాది బుద్ధి తక్కువ! రండ్రా! పోదాం! ఏదో, పసిపిల్లడి మీద జాలిగొదీ. నీ పెళ్ళం ఏడుపు చూసీ గానీ నీమీద అభిమానంతో మేం నీకు సాయపడదామనుకోడం లేదు''.

మాటా మాటా పెరిగిపోయింది. చలపతి రెచ్చిపోయాడు. కడుపులో శోకం. ఉక్రోషం. స్వభావం తాలూకు అహంకారం. వాళ్ళమీంచి వాడి ఆగ్రహం ఆ తీసుకువచ్చిన మనిషి మీదికి తిరిగింది. వాడిని పట్టు కున్నాడు. ఎడాపెడా తన్నేడు. ఒళ్ళు తెలీకుండా తన్నేడు.

అతగాడు లబోదిబోమన్నాడు. దెబ్బల్తో ఒళ్ళు హూనమయింది. నెత్తురు చారికలు కట్టింది. వచ్చే ప్రాణం. పోయే ప్రాణంగా వుందతడి స్థితి.

ఆ సమయంలో అక్కడికి గబగబా వచ్చాడు ఒక వ్యక్తి ఎత్తుగా వున్నాడు. ఎండిన మానులా వున్నాడు. జుత్తు తెల్లబడి వుంది. కళ్ళు లోతుకు పోయి, శూన్యంలోకి చూస్తున్నట్లున్నాయి. అతను వచ్చినంత వేగం గానూ, ''ఆగు!'' అని అరిచాడు.

చలపతి తుళ్ళిపడి చూశాడతన్ని.

కిందా మీద చూశాడు. ''నువ్వెందుకు వచ్చావు? నీకెందుకు మా వూసు?'' అన్నాడు కోపంతో.

''ఆణ్ణి చంపేకు!''

''ఏం? సూళ్ళేక పోతన్నావా? జాలిపడి పోతన్నావా?'' వెటకారంగా అన్నాడు చలపతి.

''నేరం చెయ్యకుండా, ఆడు నీ చేతుల్లో సచ్చిపోవడం శానా అన్యాయం!! నువ్వు బొత్తిగా మంచీ చెడ్డా చూడకుండా నీకేటి తోస్తే అది చేస్తున్నావు! మొదట్నించీ నీకిదే పాడు బుద్ధి! ఆణి ఒదిలెయ్యి!''

చలపతికి వ్యతిరేకంగా, ఆ వచ్చినతడికి వత్తాసుగా ఆ వాడలోని వాళ్ళు వచ్చేరక్కడికి, వాళ్ళంతా ఇందాక చలపతితో పోట్లాడీ వెనక్కి మళ్ళిన వాళ్ళే.

''ఒదిలెయ్యి చలపతీ! ఆణ్ణి చంపకు! నీకు బుర్ర పాడయింది! చెడ్డ తనం తోనే నువ్వు మీ నాన్నని ఇంటినించీ తగిలేసేవు! నువ్వు చెడ్డతనంతో వాడలో వాళ్ళందర్నీ చెడ్డ చేస్కుంటున్నావని మీ నాన్న అన్నాడని, పో పొమ్మన్నావు! ఆయన నీకు మంచి చెప్పడం నీకు యికటించింది...'' అన్నాడు వాళ్ళలో ఒకడు.

''ఇదిగోనయ్యా! ఇలాగే ఆ రోజూ నేను చెప్పేనయ్యా! ఈడు పీకదాకా తాగేసీ, రిక్షా బాబుల్ని పీకనులిపీ బోతావుంటే, నాక్కోపం వొచ్చి ఒక్కటి వేసి విడిపించేనని, ఈడు నన్ను బూతుల్తిట్టీ, యింట్లోంచి పొమ్మన్నాడు! సరే! నాకు మాత్రం పౌరుషం లేదేటి. బతకలేనా? ఎక్కడో కూలీనాలీ చేస్కు బతుకుతున్నాను? ఇదిగో? ఇయ్యాల మళ్ళా వొచ్చేనిక్కడికి! ఎందుకొచ్చేను? ఈడు ఈడ్ని చంపీడం తెల్సీ వొచ్చేను? మీరేనా సెప్పండి! ఆడు దొంగ కాడు!''

చలపతితో పాటు వాళ్ళూ విస్మయంతో చూశారతడ్ని.

''ఇదిగో! ఈడు దొంగ కాడు! మళ్ళా చెబ్తున్నా...! చలపతి కొడుకు ఏటీ అయిపోలేదు! ఒక్కమాట!''

''ఎక్కడున్నాడు?'' దాదాపుగా వాళ్ళంతా ఏక కంఠంతో అడిగాడు. అందర్లో ఒకే ఆత్రం.

''చెప్తాను! ఇదిగో! ఈ చలపతి ఎంత చెడ్డతనంతో ఒళ్ళు తెలీకుండా ఎదవ పన్లు చేస్తున్నాడో... రేపు ఈడి కొడుకు అంతే చెడ్డవోడయీ తీర్తాడు!! అది పచ్చి నిజం. నా నిదానం. తాపీ, కుదురూ, ఆలోచనా ఈడికి రాలేదు! నా మంచి ఈడికి రాకపోయినా, ఈడి చెడ్డ ఈడి కొడుక్కి తప్పకుండా వస్తాది! అదే నా భయం!! చెడ్డకి బలం ఎక్కువ! చెడ్డకున్న జోరూ, వూపూ యింతా అంతాకాదు! చలపతి కొడుక్కి మంచి చెయ్యడానికీ ఆడి బాగు కోసం, ఆడు బతికినంత కాలం అందర్తో, తన వోళ్ళతో మంచిగా వుండాలంటే... ఆడిక్కడ వుండాలంటారా? దూరంగా వుండాలంటరా?? మీరే సెప్పండర్రా?

''దూరం గానే వుండాలి! అది నా ఆలోచన! నా అభిప్రాయం! ఆడు ఆళ్ళ నాన్నలా పీకెదాకా తాగుతూ, కయ్యలాడూ, తగులూ తంటాలు తెస్తూ, అందర్తో యిరోదంపడ్తూ దుర్మార్గపు ఎదవ బతుకు బతకడం నా కిష్టం లేదు. అందుకే... ఆడు తప్పుడు దోవన పడకుండా, నేను తప్పుడు దోవన ఆడి కోసం వెళ్ళాను! రాత్రేళ, దొంగతనంగా ఎత్తుకు పోవడం తప్పా, మరో దారిలేదు.

''చెప్పండి! మీరేం చెయ్యమంటే అది చేస్తాను!! ఆ కుర్రోణ్ణి ఆడి నాన్నకీ, చెడ్డకీ అప్పచెప్పమంటారా? ఆడి తాతకీ, మంచికీ వుంచమంటారా?...''

చలపతి... ఆ సరికి నవనాడులూ కృంగిపోయిన చలపతి నిర్ణయం, వాళ్ళ నిర్ణయం కోసం ఎదురు చూస్తోంది.

*

***1984*** రక్తాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ



## పుకార్లు లేకపోతే జీవితం బోర్!

గాసిప్స్... అదే పుకార్లు లేకపోతే జీవితం మరీ బోర్ కొడుతుందని మిల్కీబ్యూటీ తమన్నా అంటోంది. ''పుకార్లు పరిశ్రమలో ఒక భాగం. ఎలా ఉన్నా, ఎలా ప్రవర్తించినా పుకార్లు వస్తూనే ఉంటాయి. కాకపోతే వాటిని పట్టించుకుంటే మాత్రం ఇక్కడ అస్సలు పనిచేయలేం. ఒక విధంగా పుకార్లు హీరో హీరోయిన్లకు టానిక్‌లా పనిచేస్తాయని నా నమ్మకం. ప్రేక్షకులకు వినోదాన్ని అందించే మాకు పుకార్లు వినోదాన్ని ఇస్తాయి. నా మటుకు నాకు కొన్ని సందర్భాలలో వీటిని వింటుంటే చచ్చే నవ్వు వస్తుంది. అలా అని వాటి గురించి పెద్దగా ఆలోచించను. నా పని నేను చేసుకుంటూ పోతాను. కోలీవుడ్‌లో నా మీద ఎన్నో పుకార్లు వచ్చాయి. అవి వింటూ నన్ను నేను సరిచేసుకోగలిగాను కూడా. అందుకే అవి లేకపోతే జీవితం మరీ బోర్‌కొడుతుందనేది నా స్ట్రాంగ్ ఫీలింగ్'' అంటూ చెప్పుకొచ్చింది తమన్న.